క్లుప్తంగా

నాణ్యమైన వైద్య సేవలందించండి



మాట్లాడుతున్న ఎంపీపీ నరసింహులు

ఉరవకొండ: పీహెచ్‌సీకు వచ్చే సామాన్య, పేద, మధ్యతరగతి వర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని ఎంపీపీ నరసింహులు సూచించారు. శుక్రవారం మండలంలోని రాకెట్ల పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీపీతో పాటు ఎంపీడీఓ అమృతరాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ఆమోదించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ వెంకటేష్‌నాయక్, డాక్టర్ పావని, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణ రెడ్డి

కూడేరు: ఆస్పత్రి అభివృద్ధి నిధులు(హెచ్‌డీఎస్ ఫండ్)తో పీహెచ్‌సీలో వైద్యం కోసం వచ్చే ప్రజలు , సిబ్బందికి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని పీహెచ్‌సీ చైర్మన్, ఎంపీపీ నారాయణ రెడ్డి వైద్యాధికారుకులకు సూచించారు. శుక్రవారం కూడేరులోని పీహెచ్‌సీలో హెచ్‌డీఎస్ ఫండ్ వినియోగంపై సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రి ప్రహరీ మరమ్మతులు చేయించాలని, చుట్టూ లైట్లు ఏర్పాటు చేయించాలని, ముఖద్వారం వద్ద ఆస్పత్రి నేమ్ బోర్డు ఏర్పాటు చేయించాలని డాక్టర్ లక్ష్మీనారాయణ కోరారు. స్పందించిన ఎంపీపీ వాటి ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. ఎంపీడీఓ నాగభూషణ రెడ్డి, డాక్టర్ లక్ష్మీనారాయణ, ఆస్పత్రి సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ విగ్రహ పునఃప్రతిష్ట

కూడేరు: స్థానిక స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న పెద్దమ్మ ఆలయంలో ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి అమ్మవారి విగ్రహాన్ని కదిలించారు. దీంతో శుక్రవారం అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ప్రజలు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

- విశ్వసనీయతకు మారుపేరు సీఎం జగన్
- ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు, పార్లమెంట్ సమన్వయకర్త శంకరనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా



రాయదుర్గంలో మాట్లాడుతున్న ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి. చిత్రంలో పైలా, శంకరనారాయణ

రాయదుర్గం/బొమ్మనహాళ్: వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలని ఏపీఐఐసీ చైర్మన్, పార్టీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, పార్లమెంట్ సమన్వయకర్త శంకర్‌నారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య సూచించారు. శుక్రవారం పట్టణంలోని మెట్టు నివాసం వద్ద ఏర్పాటు చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశానికి వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, పార్టీ ముఖ్య నాయకులతో కలసి మెట్టు మాట్లాడారు. మాటలు చెప్పడం, మాయ చేసి మభ్యపెట్టడం చంద్రబాబు కు వెన్నతో పెట్టిన విద్య లాంటిదన్నారు. రాజకీయాల్లో 40 ఏళ్ల ఇండస్ట్రీ, 14 ఏళ్లపాటు సీఎంనంటూ గొప్పలు పోవడం తప్పా చెప్పుకోవటానికి ఒక్క పథకం లేదన్నారు. అధికారం కోసం ఆయన కలసి సంసారం చేయని పార్టీలంటూ ఏవీ మిగలలేదన్నారు. విశ్వసనీయతకు సీఎం జగన్ మారుపేరైతే, వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు అని మండిపడ్డారు. మంచిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తూ, గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.

బాబు, కాలవ గిమ్మిక్కులకు మోసపోవద్దు

రాష్ట్రంలో చంద్రబాబు, రాయదుర్గంలో కాలవ శ్రీనివాసులు గిమ్మిక్కులకు ఆకర్షితులై ఏ ఒక్కరూ మోసపోవద్దంటూ పార్లమెంట్ సమన్వయకర్త, పార్టీ జిల్లా అధ్యక్షుడు సూచించారు. పేదలకు మేలు జరిగిందంటే అది ఒక్క సీఎం జగన్‌తోనే సాధ్యమైందన్నారు. 2024లోనూ భారీ మెజార్టీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. జగన్ సీఎంగా ఉంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి, మాజీ ఎంపీపీ ఆలేరు కలేకుర్తి జయరామిరెడ్డి, హంపారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వలీబాషా, పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, కణేకల్లు ఆలూరు చిక్కన్న, బొమ్మనహాళ్ చంద్రశేఖర్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, మైనార్టీ నాయకుడు రహంతుల్లా, ఆయా మండలాల ఎంపీపీ, జెడ్పీటీసీ, మండల కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పట్టణ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, నియోజకవర్గంలోని నాయకులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

పారదర్శక పాలన అందజేస్తున్న జగనన్న పాలనను మరోసారి ఆశీర్వదించాలని ఏపీఐఐసీ చైర్మన్, రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం సాయంత్రం బొమ్మనహాళ్ మండలంలోని ఉంతకల్లు గ్రామంలో పర్యటించారు. గడప గడపకూ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను, చేసిన మంచిని వివరించారు. కార్యక్రమంలో నాయకులు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి, మెట్టు హనుమంతరెడ్డి, సర్పంచ్ ముక్కన్న, నాయకులు రామాంజనేయరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పెద్దిరెడ్డి, దేవరెడ్డి, కేశవరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, డాక్టర్ బసప్ప, సూర్యప్రతాప్‌రెడ్డి, కాశీం, వెంకటేశులు, రమేష్, లోకేష్ పాల్గొన్నారు.



ఉంతకల్లులో సంక్షేమ పథకాలు వివరిస్తున్న సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

ఆలయాల్లో పూజలు

రాయదుర్గం పట్టణంలోని ప్రసిద్ధి చెందిన దశ భుజ గణపతి ఆలయం, బొమ్మనహాళ్ మండలంలోని రుక్మిణీ పాండురంగస్వామిని ఏపీఐఐసీ చైర్మన్, రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న కళ్యాణదుర్గం సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుదామని కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య అన్నారు. కళ్యాణదుర్గం మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, వైస్ చైర్మన్ జయంఫణి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఉద్యోగులు, సిబ్బంది కౌన్సిలర్ల పట్ల జవాబుదారీగా పనిచేయాలన్నారు. అనంతరం సిబ్బంది, ఉద్యోగుల వివరాలను పేరు పేరునా అడిగి తెలుసుకున్నారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రధాన రహదారుల్లో డివైడర్ల మధ్య ఉన్న మొక్కలను అందంగా కత్తిరించి శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అలాగే సిబ్బంది, ఉద్యోగికి జాబ్ చార్ట్ ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జ్ కమిషనర్‌కు ఆదేశించారు. ముఖ్యంగా ప్రజలకు అవసరమైన తాగునీరు అందించేందుకు సంబంధిత అధికారులతో చర్చించామని ఎంపీ తెలిపారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగు, వీధిలైట్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌చార్జ్ కమిషనర్ అశ్వర్థనారాయణను ఆదేశించారు. పట్టణంలో అవసరమైన వీధిలైట్ల ఏర్పాటుకు ఎంపీ నిధులతో ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మన్న, అర్చన, మహాలక్ష్మి, కో ఆప్షన్ సభ్యులు అఫ్జల్, సుధీర్, గోపారం శ్రీనివాసులు, బాలా సోము, సురేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

ఇటీవల ప్రమాదానికి గురై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న కళ్యాణదుర్గం మండలం మానిరేవు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కురుబ రాయుడప్పను అనంతపురం ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య పరామర్శించారు. శుక్రవారం ఎంపీ మానిరేవుకు వెళ్లారు. అనంతరం రాయుడప్ప ఆరోగ్య స్థితిపై ఆరా తీశారు. నాయకులు జోజిరెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు ఎంపీని సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, నాయకులు దొణస్వామి, వెంకటేశులు, గోళ్ల సూరి, జేసీఎస్ కన్వీనర్ ఆంజినేయులు, ఎంపీటీసీ ఓబుళపతి, బ్రహ్మయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

కళ్యాణదుర్గం/రాయదుర్గం టౌన్/ఉరవకొండ/కుందుర్పి/వజ్రకరూరు: స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్‌కుమార్ అన్నారు. కళ్యాణదుర్గం మండల పరిధిలోని బోరంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నెహ్రూ యువ కేంద్రం, ఆదర్శ యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ యువజనోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద జీవిత చరిత్ర, వివిధ అంశాలపై నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి తిమ్మరాజు, దుర్గం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ కంబాల తిమ్మారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఎస్వీజీఎం డిగ్రీ కళాశాలలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శంకరయ్య, ఎస్వీజీఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె శ్రీధర్, డాక్టర్ రవిశంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే రాయదుర్గం పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను శారదాదేవి శాశ్వత జ్ఞాన నిధి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ తరుపున రూ.3 లక్షల విలువ చేసే స్కాలర్‌షిప్స్‌ను పేద విద్యార్థులకు దాతలతో కలిసి శారదాదేవి ట్రస్ట్ చైర్మన్ స్వామి అర్చనానంద అందజేశారు. ఎంబీబీఎస్, బీటెక్, ఫార్మాసి చదివే 29 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందించారు యాదవ సంఘం అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు, దాతలు, ట్రస్ట్ సభ్యులు, వివేకానంద యూత్ ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు. అదే విధంగా ఉరవకొండలో లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఆయూర్ ప్రతినిధులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన యువజన దినోత్సవంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు వివేకానందుడి చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే కుందుర్పిలో ఎస్కె చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, వజ్రకరూరులోని పోలీస్ స్టేషన్ వివేకానందుడి జయంతి ఘనంగా నిర్వహించారు.

సరిహద్దులో నిఘా పెంచాలి

బొమ్మనహాళ్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, సరిహద్దు ప్రాంతాల్లో నిఘా మరింత పెంచాలని కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం ఆంధ్రా సరిహద్దులోని బొమ్మనహాళ్, బొల్లనగుడ్డం చెక్‌పోస్టులను డీఎస్పీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సరిహద్దులో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం, నగదు రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆంజినేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రాయదుర్గం: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం రావాణా చేస్తూ శుక్రవారం గుమ్మఘట్ట మండలం నేత్రపల్లికి చెందిన ఓంకార్, రాయంపల్లికి చెందిన శివకుమార్, పట్టణానికి చెందిన ఎరుకుల చిన్న, బాలప్ పట్టుబడ్డారని సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి 834 టెట్రా పాకెట్లు, రెండు ద్విచక్రవాహనాలు సీజ్ చేశామన్నారు. రాజేష్ అనే వ్యక్తి తప్పించుకున్నాడన్నారు. హెడ్‌కానిస్టేబుల్ షఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరలకు టికెట్లు విక్రయిస్తే చర్యలు

కళ్యాణదుర్గం: సినిమా హాలులో అధిక ధరలకు టికెట్లు విక్రయిస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ రాణి సుస్మిత హెచ్చరించారు. థియేటర్లలో సౌకర్యాలపై శుక్రవారం జై భీం సంరక్షణ సమితి అధ్యక్షులు విలియమ్స్, యువరాజ్యం జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది అలెగ్జాండర్, అనంత వాయిస్ టీపీ సురేష్ తదితరులు ఆర్డీఓను కలిసి ఫిర్యాదు చేశారు స్పందించిన ఆర్డీఓ వెంటనే వెంకటేశ్వర థియేటర్‌ను పరిశీలించారు. శుభ్రత, టికెట్ల విషయంపై నిర్వాహకులపై మండిపడ్డారు. నిబంధనలను అతిక్రమించి టికెట్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వెంకటేశ్వర థియేటర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ రాణి సుస్మిత

పేదలకు వరం 'ఆరోగ్య సురక్ష'

కుందుర్పి: జగనన్న సురక్ష పథకం పేదలకు వరమని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి అన్నారు.శుక్రవారం మండలంలోని ఎనుములదొడ్డిలో వైద్య శిబిరం నిర్వహించారు.కార్యక్రమంలో వైద్యాధికారులు అనూషా, నారాయణస్వామి, సోమేష్‌కుమార్, సర్పంచ్ మహదేవమ్మ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విడపనకల్లు: మండలంలోని గడేకల్లు సచివాలయం–1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పావతి, సర్పంచు సుశీల, పాల్తూరు వైద్యాధికారి శ్రీకాంత్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీటీసీ ఓబుళేసు, మాజీ సర్పంచు భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉత్తమ ఎంపీఈఓకు సన్మానం

ఉరవకొండ: మండలంలోని రాకెట్ల ఆర్‌బీకేలో ఎంపీఈఓ రామ్మూర్తిని రైతులు సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం అతడిని ఉత్తమ ఎంపీఈఓగా ఎంపిక చేయడంతో వారు సన్మానించారు.

వ్యవసాయ సలహా మండలి సమావేశం

విడపనకల్లు: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఏఓ పెన్నయ్య అధ్యక్షత వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం రైతుల కోసం చేపట్టిన పథకాలపై చర్చించారు. జెడ్పీటీసీ హనుమంతు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీఏఏలు, ఆర్‌బీకే సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీ

బెళుగుప్ప: 2022–23లో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో కొనసాగిన పనులపై సామాజిక తనిఖీ అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీపీ పెద్దన్న, ఎంపీడీఓ రామచంద్ర సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వారు సామాజిక తనిఖీపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, ఏపీఓ స్వాతి, ఎస్ఆర్‌పీ లోకేష్, డీఆర్‌పీలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

వార్డు సభ్యురాలి రాజీనామా

కూడేరు: మండలంలోని కలగళ్లకు చెందిన పంచాయతీ 6వ వార్డు సభ్యురాలు కవిత శుక్రవారం ఎంపీడీఓ నాగభూషణ రెడ్డిని కలసి రాజీనామా పత్రాన్ని అందజేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

పరామర్శ

కూడేరు: మండలంలోని పి.నారాయణపురం మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత శ్రీధర్ భార్య యశోదమ్మ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి ఫోన్‌లో శ్రీధర్‌ను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎంపీపీ నారాయణరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, ముద్దలాపురం సర్పంచ్ ధనుంజయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ దేవేంద్ర, సింగిల్ విండో అధ్యక్షుడు వడ్డే గంగాధర్, నాయకులు రామచంద్ర, గంగాధర్, మలిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

కళ్యాణదుర్గం: పట్టణంలోని దేవీరమ్మ కాలనీకి చెందిన జ్ఞానసుందర్ కుమార్తె మేఘన బీఎస్సీ ఎంఎల్‌టీ చదువుతోంది. అయితే కళాశాలలో ఫీజు కట్టేందుకు పేదరికం అడ్డురావడంతో ఇంటివద్ద ఉంటోంది. విషయం తెలుసుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి బద్దేనాయక్ శుక్రవారం విద్యార్థిని ఇంటికి వెళ్లి రూ.23 వేల నగదు ఆర్థికసాయం చేశాడు. విద్యార్థిని కుటుంబ సభ్యులు ఉపాధ్యాయుడికి కృతజ్ఞతలు తెలియజేశారు.

కొత్త పింఛన్ల పంపిణీ

విడపనకల్లు: మండలంలోని కడదరబెంచి గ్రామంలో శుక్రవారం సర్పంచు కురుబ ధనలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు కురుబ దేవారాజు కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'వరి ధాన్యం విక్రయించుకోండి'

కణేకల్లు: వరి పంటను ఎవరికైనా విక్రయించుకోవచ్చని, మీకెవరూ అడ్డంకులు సృష్టించరని రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్ దళితులకు భరోసా ఇచ్చారు. మండలంలోని బెణికల్లు గ్రామాన్ని శుక్రవారం ఎస్ఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ శంకర్‌రెడ్డితో కలసి ఆయన సందర్శించారు. వరి పంట ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు బయట నుంచి దళారులెవరూ రావడం లేదని దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ మాట్లాడుతూ గ్రామంలో అందరితో చర్చించామని, మీ ఉత్పత్తుల విక్రయాన్ని ఎవరూ అడ్డంగించరన్నారు. బయట నుంచి దళారులు, వ్యాపారులు కొనుగోలు కోసం వచ్చేలా ఏర్పాట్లు కూడా చేశామని, గిట్టుబాటు ధరతో విక్రయించుకోవచ్చన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంట సర్పంచ్ రాధమ్మ భర్త రమేష్ (26) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. వివరాలు.. రమేష్ నెల కిందట మైసూరు వద్ద కేబుల్ పనుల కోసం వెళ్లాడు. ఐదు రోజుల క్రితం పంటినొప్పి అధికం కావడంతో ప్రైవేటు వైద్యుల వద్ద ఇంజక్షన్ చేయించుకోగా వికటించింది. అక్కడ నుంచి వచ్చి అనంతపురం సర్వజనా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

అభివృద్ధిపథంలో 'కళ్యాణదుర్గం'

కళ్యాణదుర్గం: వ్యాపార, వైద్య, విద్యా రంగాల్లో కళ్యాణదుర్గం వేగవంతంగా పురోగతి చెందుతోంది. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిపోయింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాల మంజూరు చేయడంతోపాటు, నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల అభివృద్ధికి పెద్దపీట వేసింది. నియోజకవర్గంలో ఏ మారుమూల పల్లెకు వెళ్లి...ఏ గడప తలుపు తట్టినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల మాటే వినిపిస్తుంది. ఏ ఒక్కరిని కదిలించినా మా ఇంట్లో అమ్మ ఒడి వచ్చింది...మా ఇంట్లో పింఛను వస్తోంది...మా ఇంట్లో రైతు భరోసా....వసతి దీవెన వస్తుందంటూ ఎంతో సంతోషంగా సమాధానమిస్తున్నారు. మునుపెన్నడూ లేని విధంగా, ఏ రాజకీయ పార్టీ చేయని సాహసోపేతమైన నిర్ణయాలతో గ్రామ స్వరాజ్యం దిశగా వైఎస్సార్‌సీపీ పాలన అందిస్తోంది. సమృద్ధిగా వర్షాలు కురవడంతో పంటలు సకాలంలో సాగుచేసి రైతులు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.

సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి

2019 జూన్ నుంచి 2023 మే వరకూ కళ్యాణదుర్గంలో సంక్షేమ పథకాల అమలు ద్వారా ఏకంగా 8,87,989 మంది లబ్ధిదారులకు రూ.3051.84 కోట్లు విడుదలైంది. అదేవిధంగా వివిధ పథకాల ద్వారా 55,973 అభివృద్ధి పనులకు రూ.1209.37 కోట్లు ఖర్చు చేసింది. ఈ మొత్తం అంతా ఎలాంటి దళారీల వ్యవస్థ లేకుండా నేరుగా డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాకే జమ అయ్యేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. అలాగే వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇల్లులేని వారికి జగనన్న కాలనీల్లో స్థలం కేటాయించడమే కాకుండా 3,617 ఇళ్ల మంజూరు చేసింది. ఇందులో 2410 మందికి స్థలం ఇచ్చి, ఇంటిని నిర్మిస్తుండగా 1207 మంది సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకుంటున్నారు. ఇప్పటివరకు 877 గృహాలు పూర్తి కాగా వీటిలో 1,607 గృహాలు బేస్‌మట్టం స్థాయిలో ఉన్నాయి. ఒక్కోగృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షల నిధులు కేటాయించింది. నిర్మాణం జరుగుతున్న గృహాల పరిధిలో లబ్ధిదారులకు ఇప్పటివరకు రూ. 25,04,12,793 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. తాత్కాలికంగా బోర్లు, మోటార్లు తదితర మౌలిక వసతుల ఏర్పాటు పనులను చేపట్టారు. మరో వైపు శాశ్వత మౌలిక వసతుల్లో భాగంగా తాగునీటి పథకాలు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ ఫైబర్ నెట్ తదితర ఏర్పాట్ల కోసం ప్రత్యేక నిధులు కేటాయించారు. ప్రస్తుతం కాలనీల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. తాగునీటికి సంబంధించిన బోరు బావుల తవ్వకాల పనులు 80 శాతానికి పైగా పూర్తయ్యాయి.